సాక్షి
శ్రీకాకుళం
బుధవారం ; 29 ; మే ; 2024



హద్దు మీరితే అంతే..

కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు. -8లో



జూన్ 6 వరకు ఎన్నికల కోడ్

ఎన్నికల కోడ్ జూన్ 6 వరకు ఉండనుంది. 144 సెక్షన్ కూడా అమలులోనే ఉంటుంది. -8లో

నేడు 5వ తరగతి సీట్లలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

శ్రీకాకుళం రూరల్: సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో 5వ తరగతిలో ప్రవేశాలకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎచ్చెర్లలో గల బాలికల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మిగిలిన పోయిన సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పెదపాడు గురుకుల పాఠశాల (బాలికలు) ప్రిన్సిపాల్ జ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు గాను 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసినవారు, రాయని వారు కూడా హాజరు కావచ్చునన్నారు.

న్యూస్‌రీల్

జూన్ 2న ఉచిత మోడల్ లాసెట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 2న ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీకాకుళంలోని ఎంపీఆర్ లా కాలేజీలో ఉచిత మోడల్ లా సెట్ నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు తెలిపారు. మంగళవారం ఎంపీఆర్ లా కాలేజీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్లుగా ఉచిత మోడల్ లా సెట్ నిర్వహిస్తున్నామని, ఈ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు ఎలాంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, చౌదరి లక్ష్మణరావును సెల్ నంబర్ 9640780728ను సంప్రదించాలని కోరారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయాన్ని వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ రామగిడ్డయ్య మంగళవారం సందర్శించారు. నూతనంగా ఆర్డీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి జిల్లాలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షితో కాసేపు రామగిడ్డయ్య మాట్లాడారు. అనంతరం నరసన్నపేట పీహెచ్‌సీకి సంబంధించి గత కొన్నేళ్ల కిందట వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసేందుకు చర్యలు చేపట్టారు. అంతకుముందు ఆయన అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి, శ్రీకూర్మం కూర్మనాథస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య అధికారులు అందరూ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్- 2024 కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో కొనసాగుతోంది. సహాయ కేంద్రంలో మంగళవారం 12001 నుంచి 27000 మధ్య ర్యాంకు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. పరిశీలనకు 372 మంది విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం 27001 నుంచి 43000 ర్యాంకు మధ్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. కౌన్సెలింగ్ 27న ప్రారంభించగా, ఇప్పటి వరకు 615 మంది హాజరయ్యారు. కౌన్సెలింగ్ జూన్ 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ నెల 31 నుంచి జూన్ 4వ తేదీ వరకు కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. జూన్ ఐదున ఆప్షన్ల మార్పు, జూన్ 7వ తేదీన అలాట్‌మెంట్‌ల ప్రకటన ఉంటుంది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ కౌన్సెలింగ్ పర్యవేక్షిస్తున్నారు.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

శ్రీకాకుళం రూరల్: హెచ్‌పీఎల్‌సీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బొల్లినేని మెడిస్కిల్స్ తరఫున బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులను విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సెకెండ్ ఫ్లోర్‌లో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకుగాను పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసి 18 నుంచి 28 సంవత్సరాల్లోపు ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. మూడు నెలలు శిక్షణ కాలంలో యూనిఫారంతో పాటు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ లేదా 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలన్నారు.







● ఎండల్లో కుండంత అండ

రోళ్లు పగులుతున్న రోహిణీ కార్తెలో ఫ్రిజ్‌లు కూడా నోరెళ్లబెడుతున్నాయి. భానుడి ప్రతాపానికి రిఫ్రిజిరేటర్ల చల్లదనం సరిపోవడం లేదు. అందుకే మట్టికుండపై జనం మనసు పారేసుకుంటున్నారు. మట్టికుండలోని నీటిని గొంతులోకి దింపుకుని.. ఒంటిలోని వేడిని బయటకు వెళ్లగొడుతున్నారు. వ్యాపార వర్గాలు కూడా మట్కా పేరుతో మట్టి కుండల్లో సోడా పోసి అమ్ముతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

- అందరి దృష్టి లెక్కింపు రోజు పైనే
- ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ముమ్మరం
- ఈవీఎం, వీవీ ప్యాట్‌లకు పటిష్ట భద్రత
- స్ట్రాంగ్ రూమ్‌లపై నిఘా కన్ను

పెరుగుతున్న ఉత్కంఠ



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడుతోంది. ఇన్నాళ్లూ వివిధ లెక్కలతో వివిధ రూపాల్లో చేయించిన సర్వేలతో గడిపిన నేతల్లో లెక్కింపు ప్రక్రియ దగ్గర పడుతుండటంతో టెన్షన్ పెరుగుతోంది. మరోవైపు లెక్కింపునకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి లోపాలు తలెత్తకూడదని, అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకూడదని ఒకటికి రెండు సార్లు సమీక్షిస్తున్నారు. ప్రతి రోజూ సమావేశాలు నిర్వహించి సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు. ఇంకో వైపు ఓట్లు నిక్షిప్తమై ఉన్న ఈవీఎం, వీవీ ప్యాట్‌లున్న స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భారీ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కౌంటింగ్ కౌంట్‌డౌన్

సార్వత్రిక ఎన్నికలు ముగిసి 16 రోజులు అవుతోంది. లెక్కింపునకు మరో వారం రోజులే ఉంది. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు ఎచ్చెర్ల మండలం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఉన్నాయి. ఎనిమిది అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాలకు వేర్వేరుగా 16 గదులు కేటాయించారు. వాటిలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచారు. పోలింగ్ పూర్తయిన రోజున నాయకుల సమక్షంలో సీళ్లు వేశారు. వీటికి పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. అన్ని గదులతో పాటు భవనానికి నిఘా కెమెరాలు అమర్చారు. వీటిని పరిశీలన గదికి అనుసంధానం చేశారు. పటిష్ట భద్రత మధ్య 24 గంటల పాటు నిరంతర నిఘా పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్ ఉంది. ఎనిమిది మంది ఆర్‌ఓలు, 8మంది ఏఆర్‌ఓలు,



భద్రత పర్యవేక్షిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక (ఫైల్)


నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున డీటీలు పర్యవేక్షిస్తున్నారు. ఇక మూడంచెలు గల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్‌డ్ పోలీసు గార్డు, సివిల్ పోలీసు బందోబస్తును ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ అకస్మికంగా వెళ్లి పరిశీలిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా కూడా ఇటీవల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు వేసిన సీళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు వస్తే వారికి కూడా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ కెమెరాల్లో చూపిస్తున్నారు.

పెరిగిన టెన్షన్

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకే కాదు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు కూడా టెన్షన్ పెరిగింది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో ఏమవుతుందోనన్న ఉత్కంఠ పెరిగింది. గ్రామాల వారీగా తమకెన్ని ఓట్లు వస్తాయో ఆయా పార్టీలు లెక్కలేసుకున్నాయి. కావాల్సిన వారితో సర్వే చేయించుకున్నాయి. ఇవి కూడా పోలింగ్ అనంతరం స్టడీల పేరుతో వివిధ ప్రైవేటు సంస్థలు చేసిన సర్వేలను చూసుకున్నాయి. దీంతో కొందరు ఉపశమనం పొందగా, మరికొందరు టెన్షన్‌కు లోనవుతున్నారు. చాలా మంది నాయకులు కాస్త సేద తీరేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇప్పుడు వారంతా నియోజకవర్గాలకు చేరుకుంటుండటంతో వారి వద్దకు అనుచరులు చేరుకుని మళ్లీ లెక్కలేసుకుంటున్న పరిస్థితి నెలకుంది. దీంతో అభ్యర్థులకు ఉత్కంఠ మరింత పెరిగిపోతోంది.

లెక్కింపు ఏర్పాట్లలో బిజీ

జూన్ 4వ తేదీన జరగనున్న లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులంతా బిజీగా ఉన్నారు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లెక్కింపుపై పూర్తి అవగాహన ఉండేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. లెక్కింపునకు సంబంధించి ప్రతి రోజూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు కూడా ఏ విధంగా వ్యవహరించాలన్న దానిపై కూడా అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధికార యంత్రాంగం లెక్కింపు ప్రక్రియపైనే దృష్టి కేంద్రీకరించింది. ఎక్కడా, ఎలాంటి తేడా రాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఒకటికి రెండు సార్లు అవగాహన కల్పిస్తోంది.



'ఓట్ల లెక్కింపు శాంతియుతంగా నిర్వహించాలి'



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమని, సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో మంగళవారం సార్వత్రిక ఎన్నికలు–2024 నేపథ్యంలో జూన్ 4 వ తేదీన నిర్వహించనున్న లెక్కింపు ప్రక్రియపై సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 13న పోలింగు రోజున ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వహించారని, ఆ క్రమంలో సూక్ష్మ పరిశీలకులు మంచిగా పనిచేశారని ప్రశంసించారు. జూన్ 4 వ తేదీన ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమన్నారు. జూన్ 4 వ తేదీన లెక్కింపు కేంద్రాల్లోని ప్రతి టేబుల్ వద్ద ఒక సూక్ష్మ పరిశీలకుడిని నియమించినట్లు తెలిపారు.

కౌంటింగ్ ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్‌లను నిర్వహించడం, ఎలక్ట్రానిక్‌గా ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీబీపీ), ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లు (ఈవీఎం), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ (వీవీప్యాట్ ట్రయల్స్) వంటి వివిధ అంశాలను మైక్రో అబ్జర్వర్స్ నిశితంగా పరిశీలించడం ఉంటాయన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయిలో ఈ మొత్తం ప్రక్రియను వివరించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డు తప్పనిసరి అని, లెక్కింపు కేంద్రం వద్ద అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. శిక్షణ తరగతుల కార్యక్రమంలో నోడల్ అధికారి ఎస్.బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఎల్డీఎం సూర్య కిరణ్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, సూక్ష్మ పరిశీలకులు పాల్గొన్నారు.

'కౌంటింగ్ పక్కాగా ఉండాలి'



శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికలు–2024 కౌంటింగ్ పక్కాగా జరగాలని, ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారీగా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేసే సిబ్బంది, అలాగే వాటిని క్రాస్ చెక్ చేసే మరో బృందం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి వచ్చే నెల 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ కోసం నియమించిన ట్యాబులేషన్ సిబ్బందికి మంగళవారం సాయంత్రం శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. శిక్షణ అనంతరం అంశాల వారీగా ప్రశ్నలు అడిగారు. నమోదు చేయాల్సిన దరఖాస్తుల గురించి చెప్పారు. శిక్షణ ముఖ్య ఉద్దేశం నిక్కచ్చిగా, 100 శాతం ఫలితాలు వెల్లడించేందుకేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతి రావు, మాస్టర్ శిక్షకులు శేషగిరి, జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన ఎలక్షన్ డీటీలు, సీఎస్ డీటీలు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సంసిద్ధం



- జూలై చివరి నాటికి ఉభాలు పూర్తి చేసేందుకు ప్రణాళిక
- వరుణుడు కరుణిస్తే ముందస్తుగానే నాట్లు
- ఖరీఫ్‌లో వ్యవసాయ రుణాలు, పెట్టుబడి సాయానికి ముందడుగు
- 'సాక్షి'తో వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్

వ్యవ'సాయానికి' తమ శాఖ సంసిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కె.శ్రీధర్ అన్నారు. ఖరీఫ్ ప్రణాళికను అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. విత్తనం నుంచి విక్రయం వరకు, భూయజమాని నుంచి కౌలు రైతు వరకు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఇప్పటికే రైతులకు విత్తనాలు, ఎరువులు రైతు ఇంటి వద్దనే అందించేలా ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. – శ్రీకాకుళం పీఎన్ కాలనీ

సాక్షి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నారా?
జేడీ: ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా కేంద్రాల్లో 38,882 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచాం. ఎరువులు యూరియా, డీఏపీ, ఎంటీపీ, కాంప్లెక్స్ ఎరువులు 11,894 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి. ఎక్కడా రైతు గ్రామం నుంచి బయటకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. ఆర్‌బీకేల్లోనే విత్తనాలతో పాటు పంట అనంతరం కొనుగోలు కూడా చేస్తాం.

సాక్షి: సాగు విస్తీర్ణం పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?
జేడీ: జిల్లాలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం 1.60 లక్షల హెక్టార్లుగా నిర్ణయించాం. జూన్ తొలివారంలో తొలకరి పలకరించి సమయానుకూలంగా వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో నాట్లు వేసేందుకు రైతులంతా సిద్ధంగా ఉన్నారు. వెద పద్ధతిలో 1.10లక్షల హెక్టార్లు, 50వేలు హెక్టార్లలో ఉభాలు చేసేందుకు సన్నద్ధమయ్యారు. అనుకున్న సమయంలో వర్షాలు కురిస్తే వెద పద్ధతిలో నాట్లు వేసే శాతం తగ్గుతుంది.

సాక్షి: వరితో పాటు ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహిస్తారా?
జేడీ: జిల్లాలో అధిక సంఖ్యలో రైతులు వరి పంటకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయి. దాన్ని బట్టి వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, రాగులు, గంటెలు, సామలు, కొర్రలు, కందులు, మొక్కజొన్నలు, అపరాలు వేసేలా ప్రోత్సహిస్తున్నాం. తక్కువ కాలం వరి రకాలు వరికి సుమారు 120నుంచి 130 రోజులు రోజులు పంట కాలం ఉంటుంది. మిగిలిన పంటలకు 90 నుంచి 120 రోజుల్లోపే మంచి దిగుబడులు వచ్చి అధిక ధరలకు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుంది.

సాక్షి: తుఫాన్ల నుంచి రక్షణ పొందాలంటే ఏం చేయాలి?
జేడీ: జూన్‌లోనే నాట్లు వేయడం మొదలైతే సెప్టెంబర్ నాటికి పంటకాలం పూర్తయ్యి తుఫాన్ల బారిన పడకుండా రైతులు గట్టెక్కవచ్చు. తుఫాన్లకు తట్టుకునే రకాల విత్తనాలు 1210–సుజాత, 1061–ఇంద్ర, 1064–అమర, శ్రీధృతి–1121, ఎంటియు– 1318, ఎంటియు 1224 వంటి విత్తనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.



సాక్షి: రైతు భరోసా కేంద్రాలతో రైతులకు సేవలు సక్రమంగా అందుతున్నాయా?
జేడీ: జిల్లాలో 656 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా ఖరీఫ్, రబీలలో రైతు ఇళ్లు కదలకుండానే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇంటి వద్దకే అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ–క్రాప్‌లో నమోదు చేసి అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల నుంచే అందిస్తున్నాం.

సాక్షి: సాగునలహా కమిటీల పనితీరు ఎలా ఉంది?
జేడీ: ప్రతి గ్రామంలో ఇప్పటికే వ్యవసాయ సలహా మండళ్లతో సమావేశాలు పూర్తిచేశాం. ఆయా గ్రామాల్లో భూముల బట్టి ఎలాంటి పంటలు వేయాలి, ఏ రకమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలో అవగాహన కల్పించాం. నీటి లభ్యతను బట్టి విత్తన ఎంపిక చేసేందుకు సన్నాహాలు పూర్తిచేశాం.

సాక్షి: రైతులకు వ్యవసాయ రుణాలు సకాలంలో అందిస్తున్నారా?
ఇంటర్వ్యూ
జేడీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో రైతులకు ఖరీఫ్ సీజన్‌కి ముందే రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందిస్తున్నాం. చిన్న, సన్నకారు రైతులకు రుణాలు మంజూరు చేసేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ఏడాది 3.50లక్షల మంది రైతులకు గాను రూ.4వేల కోట్లు రుణ లక్ష్యంగా బ్యాంకర్లు నిర్ణయించారు.

సాక్షి: అగ్రిల్యాబ్‌ల పనితీరు ఎలా ఉంది?
జేడీ: జిల్లాలో జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఒక్కటి, 7 నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున అగ్రిల్యాబ్‌లు నిర్మాణాలు పూర్తిచేశాం. 5 ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరిగి పనిచేస్తున్నాయి. మిగిలిన రెండుఫర్నీచర్ వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. ఈ ల్యాబ్‌లు ఎరువులు, విత్తనాలు నాణ్యతలు తెలుసుకునేందుకు ఉపయోగపడతాయి. ఆర్‌బీకే స్థాయిలో విత్త న మొలకశాతం, రైతువారి శాంపిల్స్ చేసి ఇస్తున్నాం.

సాక్షి: కౌలు రైతులకు ప్రభుత్వం ఎలా మేలు చేస్తోంది?
జేడీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక భూయజమానులతో పాటు సమానంగా కౌలు రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. కౌలు పత్రాలు జారీచేసి రైతులకు భరోసా కల్పించారు. భూయజమాని అంగీకారంతో 10 వేలు మంది కౌలు రైతులకు కౌలుహక్కుదారు పత్రాలు అందించి వ్యవసాయానికి సహకరిస్తున్నాం. వైఎస్సార్ రైతు భరోసాతో పాటు వైఎస్సార్ బీమా వర్తిస్తుంది. ధాన్యం అమ్మకాలకు, సున్నావడ్డీ, పంటల బీమా, పెట్టుబడి రాయితీ వంటి పత్రాలు అందిస్తారు. కౌలు పత్రంతో పాటు ఈ–పంట నమోదు చేసుకుంటేనే పరిహారాలన్నీ అందుతాయి. భూయజమాని కౌలుదారుని అగ్రిమెంట్ రెన్యువల్ ప్రతి ఏటా చేయాలి.

సాక్షి: ఎరువుల వాడకం తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నారా?
జేడీ: పీఎం ప్రణామమ్ అనే పథకం ద్వారా పచ్చిరొట్ట పైర్లు, జీవన ఎరువులు, వర్మీకంపోస్టు, నానో యూరియా, నానో డీఏపీ, సూక్ష్మపోషకాలు, సమతుల్య ఎరువుల వాడకానికి చర్యలు చేపడుతున్నాం.

వేంకటేశ్వర స్వామికి పుష్పయాగం

స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో పుష్ప యాగం నిర్వహించారు. ఈ పుష్పయాగంలో 51 కేజీల వివిధ రకాల పుష్పాలను వినియోగించారు. ఈ యాగంలో 40 రకాల పుష్పాలు వినియోగించామని ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. అలాగే ఉదయం స్వామి వారికి చక్రతీర్థ స్నానం వైభవంగా నిర్వహించారు. –నరసన్నపేట



వేంకటేశ్వర స్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

30న సెమినార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన ఎంఎస్ఎంఈ సెక్టారులో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై సెమినార్‌ను నిర్వహించనున్నట్లు ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఉమెన్స్ వింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వై.గీతాశ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోటరీక్లబ్, విశాఖపట్టణం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ సెమినార్‌ను ఈనెల 30వ తేదీ గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ గాయత్రి విద్యా పరిషత్, ఎంవీపీ కాలనీ, విశాఖపట్టణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు హ్యాండ్‌హోల్డింగ్ మద్దతు లభిస్తుందన్నారు. సెమినార్ తర్వాత ఆర్థిక సాయం కోసం బ్యాంక్ టై-అప్‌తో పాటు జూన్-14, 15 తేదీల్లో ప్రతి సెక్టారుకు వివరణాత్మక వర్క్‌షాపులు ఉంటాయని తెలిపారు. ఎంట్రీ ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన ఉంటుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డాబా మీద నుంచి జారి పడి వృద్ధుడు మృతి

సారవకోట: మండలంలోని అన్నుపురం గ్రామానికి చెందిన ఎల్ల పోలీసు (65) డాబా మీద నుంచి జారి పడి మృతి చెందారు. ఈ మేరకు కుమారుడు సంతోష్ మంగళవారం స్థానిక పోలీసులకు తెలిపాడు. ఈ నెల 23న డాబా మీద పడుకున్న తన తండ్రి మూత్ర విసర్జన కోసం కిందకు దిగుతూ కాలు జారి పడిపోయారని, వెంటనే 108 వాహనంలో రాగోలు ఆస్పత్రికి తరలించామని, పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కి తరలించినట్లు ఆయన తెలిపాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు పేర్కొన్నాడు.

వృద్ధుడు అదృశ్యం


అప్పల రామయ్య

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామానికి చెందిన గురువడ్ల అప్పల రామయ్య (72) ఈ నెల 24 నుంచి కనిపించడం లేదని కుమారుడు సింహాచలం మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 24న బుడితి వెళ్లి మందులు కొనుగోలు చేసుకుని వస్తానని చెప్పి ఇప్పటి వరకు తిరిగి రాలేదని పేర్కొన్నాడు. ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

శరవేగంగా పశువులకు టీకాలు


కోటబొమ్మాళిలో సమీక్ష చేస్తున్న జిల్లా వెటర్నరీ ఇన్‌చార్జి జేడీ జయరాజ్

కోటబొమ్మాళి: జిల్లా వ్యాప్తంగా ఆర్‌బీకేల ద్వారా శరవేగంగా పాడి పశువులకు జబ్బవాపు, చిటుక వ్యాధి నివారణకు టీకాలను వేయిస్తున్నట్లు జిల్లా వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) వి.జయరాజ్ తెలిపారు. ఆయన మంగళవారం కోటబొమ్మాళి వెటర్నరీ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రానున్న వర్షాకాల సీజన్‌లో పాడి పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకూ పాడి పశువులకు జబ్బవాపు నివారణకు 68,905 టీకాలు, మేకలు, గొర్రెలకు చిటుక వ్యాధి నివారణకు 2,99,189 టీకాలు వేశామని, ఇప్పటి వరకూ 90శాతం మేర వ్యాక్సినేషన్ పూర్తి చేశామని, ఈ నెలాఖరు నాటికి 100 శాతం పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద మంద లోకనాథం, కురుడు పసువైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్, ఎం.ప్రజ్ఞచైతన్య, వెటర్నరీ సహాయకులు ఎస్.శాంతారావు, కోట ధర్మారావు పాల్గొన్నారు.

హద్దు మీరితే అంతే..

- కౌంటింగ్ రోజు దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న వారిపై రౌడీషీట్
- విజయోత్సవ ర్యాలీలు, ధర్నాలు రద్దు
- జిల్లా అంతటా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం సమాయత్తం


ఎచ్చెర్ల శివానీ కళాశాల వద్ద కౌంటింగ్ భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

శ్రీకాకుళం క్రైమ్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ సజావుగా ముగిసింది. ఇక కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. మరో ఐదు రోజుల్లో ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియ మొదలు కానుండటంతో కౌంటింగ్ రోజు, కౌంటింగ్ అనంతరం ఎలాంటి అల్లర్లు, హింసాత్మక, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్పీ జీఆర్ రాధిక నేతృత్వంలోని జిల్లా పోలీసు యంత్రాంగం సకల చర్యలు తీసుకుంటోంది. హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది.

పటిష్ట భద్రత..

ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జూన్ 4 కౌంటింగ్ రోజున పటిష్ట భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా కౌంటింగ్ కేంద్రాలు, అధికారులు, సిబ్బంది, ఏజెంట్లు వచ్చే మార్గాలు, వాహన పార్కింగ్, రూట్ మ్యాప్‌ను ఇప్పటికే పరిశీలన చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్ విభాగాలతో పాటు ఇతర శాఖల సమన్వయంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా మూడంచెల (వన్‌టైర్- కేంద్రబలగాలు, టూ టైర్- పారామిలిటరీ, త్రీ టైర్- సివిల్ పోలీసులతో) భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో కలిసి ఎస్పీ రాధిక దిశానిర్దేశం చేశారు. ప్రతి రోజూ ఎస్పీ ఏదో ఒక సమయంలో ఎచ్చెర్ల శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేసి అక్కడ పహారా కాస్తున్న గార్డ్ సిబ్బందిని అప్రమత్తం చేసి నిఘా పక్కాగా ఉండేలా చేస్తున్నారు. శాసనసభ, పార్లమెంటు స్థానాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రోన్లు ఏర్పాటు చేయడమే కాక అధిక సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన అనుమతి పత్రాలున్న వారినే వీరు కౌంటింగ్ కేంద్రాలకు వదులుతారు.

మాక్ డ్రిల్.. సమావేశాలతో..

కేంద్ర బలగాలు స్థానిక పోలీసులతో కలసి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కార్డన్ సెర్చ్‌లు, ఫ్లాగ్‌మార్చ్‌ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక హింసాత్మక ఘటనలు చెలరేగితే పోలీసుల చర్యలు ఎలా ఉంటాయన్నదానిపై ఇప్పటికే మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్స్ ద్వారా చూపిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయా గ్రామాల్లో శాంతి కమిటీల ప్రతినిధుల, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రశాంత కౌంటింగ్ జరిగేందుకు సహకరించాలని కోరుతున్నారు. అల్లర్లు చెలరేగే అవకాశం ఉండే టెక్కలి, పలాస వంటి నియోజకవర్గాల్లోని ముఖ్య కేంద్రాలు, అక్కడి సమస్యాత్మక గ్రామాల్లో రాత్రి వేళల్లో ఎస్పీ స్వయంగా సందర్శించి సమావేశాలు పెట్టి ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

ర్యాలీలు, ధర్నాలకు చెక్..

ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు చేసినా.. ఫలితం తారుమారై ఓటమిపాలైన నేతల అనుచరగణం, కార్యకర్తలు రోడ్లపై ధర్నాలకు దిగినా సహించేది లేదని పోలీసులు చెబుతున్నారు. డీజేలతో సంబరాలు, బాణాసంచా విక్రయాలు, పెట్రోలు బంకుల్లో లూజు పెట్రోలు విక్రయాలకు ఎన్నికల కోడ్ ఉన్నందున జూన్ 6 వరకు అనుమతి లేదంటున్నారు. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి పెద్ద శబ్దంతో వాహనాలు నడపరాదని అంటున్నారు. అవాంఛనీయ, హింసాత్మక ఘటనలు, సంఘ విద్రోహక శక్తులు, అల్లరి మూకల కవ్వింపు చర్యలు, సోషల్ మీడియా వేదికలపై పోస్టు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నారు.

విధ్వంసాలకు పాల్పడితే..

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉండటమే కాక 30 పోలీస్ యాక్ట్ కూడా ఉంది. ఈ క్రమంలో అధిక సంఖ్యలో గూమిగూడి ప్రజలు ఎక్కడా ఉండరాదు. ఘర్షణలు, దొమ్మీ కొట్లాటలు జరిగిన చోట ఆ పరిధి ఎస్ఐతో కూడిన సిబ్బంది నిరోధిస్తారు. మరీ పెద్ద గొడవలైతే కేంద్ర బలగాలు, పారా మిలిటరీ, ఆర్మ్‌డ్ రిజర్వ్ దళాలు రంగంలోకి దిగి కంట్రోల్‌లోకి తెస్తాయి. ఘటనల్లో పాల్గొన్నవారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు. గొడవలు జరుగుతాయన్న సమాచారం ఉంటే ముందస్తు అరెస్టులు చేయడం.. హింసాత్మక ఘటనలకు, విధ్వంసాలకు కారణమైన వారిపై రౌడీషీట్లు తెరిచి జైలుకు పంపించే అవకాశం ఉంది. మద్యం విక్రయాలు కూడా తమ నియంత్రణలో ఉండేటట్లు పోలీసులు చూసుకుంటున్నారు.

కౌంటింగ్ అనంతరం..

కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం అల్లర్లు చెలరేగే అవకాశం ఉన్నందున ముందుగా గుర్తించిన అలాంటి ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటుచేస్తారు. ఇప్పటికే గుర్తించిన ట్రబుల్ మాంగర్స్‌కు నోటీసులిచ్చి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. గొడవలకు దిగే రౌడీషీటర్లను, అనుమానితులపై బైండోవర్ చేశారు. జిల్లాలోని ప్రతీ పీఎస్ పరిధి రౌడీషీటర్లకు పోలీసులు రెండుసార్లు కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. అయినప్పటికీ నాయకుల అండ చూసి అల్లర్లకు దిగితే జైలు పాలవ్వడం తప్పదంటున్నారు పోలీసులు.

అంతా సహకరించాలి..

సజావుగా ఎన్నికల అంకం ముగిసేందుకు జిల్లా ప్రజలు, రాజకీయ నాయకులు, పార్టీలు సహకరించాలి. కౌంటింగ్ సమయంలో అభ్యంతరాలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలి. కౌంటింగ్ అనంతరం గెలుపోటముల దృష్ట్యా ఎవరైనా కవ్వింపులకు పోయినా, కొట్లాటకు దిగినా రౌడీ షీట్లు తెరిచి జిల్లా నుంచి బహిష్కరిస్తాం. ఇంకా వినకపోతే పీడీ చట్టం కింద కేసులు పెట్టి ఆరు నెలలు జైలుకు పంపుతాం. పరిస్థితులు అదుపు తప్పితే లాఠీ ఛార్జి, ఫైరింగ్ చేసేందుకు కూడా వెనుకాడం.

– జీఆర్ రాధిక, ఎస్పీ, శ్రీకాకుళం


కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో గ్రామస్తులను చైతన్యపరుస్తున్న ఎస్పీ రాధిక

ఇసుక ర్యాంపుల పరిశీలన


ఆకులతంపర వద్ద ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు బృందం

కొత్తూరు: మండలంలోని వంశధార నదిలో అంగూరు, ఆకులతంపర, మాతల, నివగాం ఇసుక ర్యాంపులను మైన్స్ డీడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు శాఖలకు చెందిన అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఇసుక ర్యాంపుల నిర్వహణపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపులు పరిశీలించినట్లు డీడీ చెప్పారు. నివగాం ఇసుక ర్యాంపునకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయన్నారు. అయితే ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలు మాన్యువల్‌గా చేయాలి తప్ప యంత్రాలతో ర్యాంపులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. మిగిలిన ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు లేవని చెప్పారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక ర్యాంపులు నిర్వహిస్తే కోర్టు ఆదేశాల మేరకు ప్రతి వారం నియమించిన బృందం తనిఖీలు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తుందని తెలిపారు. ర్యాంపుల వద్ద ఇసుక తవ్వకాలు చేయరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తనిఖీల్లో సెబ్ స్టేషన్ సీఐ బి.జయరామరెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ రామకృష్ణప్రసాద్, ఏఈఈ మణికంఠ, అసిస్టెంట్ హైడ్రో జియాలజిస్టు జి.త్రివేణి, ఎస్ఐ ఎంఏ హమ్మద్, ఆర్ఐ లక్ష్మణరావు, వీఆర్వో శంకర్, రాజగోపాలరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

లారీ బోల్తా డ్రైవర్‌కు గాయాలు


జాతీయ రహదారిపై బోల్తాపడిన లారీ

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు సమీపంలో మంగళవారం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ఇనుప కంచెను ఢీకొని ముందుకు వెళ్లాడు. లారీ వేగానికి ఇనుక కంచె 10 మీటర్ల వరకు ధ్వంసమైంది. డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడంతో లారీ బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ ప్రమోద్ యాదవ్ గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్‌ది బీహార్ రాష్ట్రం నాగపూర్ ప్రాంతం. లారీ క్యాబిన్‌లో ఉన్న క్లీనర్ సురక్షితంగా బయట పడ్డాడు. పోలీసులు, హైవే సిబ్బంది సహాయ చర్యలు చేపట్టి, ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు


సవరకుడ్డబ గ్రామంలో సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని రింపి గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సమన్వయంతో బుధవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 45 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దాడుల అనంతరం ఆయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. సారా తయారీ, క్రయ విక్రయాలు మానుకోవాలని పిలుపునిచ్చారు. పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్ర కుమార్, టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

పశువుల అక్రమ రవాణా


మండలంలోని నివగాం వద్ద పట్టుకున్న పశువులు

కొత్తూరు: పది పశువులకు అక్రమంగా బొలేరో వ్యాన్‌లో తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ ఎంఏ అమ్మద్ తెలిపారు. ఒడిశా నుంచి బొలేరో వ్యాన్‌తో అక్రమంగా తరలిస్తున్న పశువులను మండలంలోని నివగాం గ్రామం వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న హిరమండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పశువులను మందస గోశాలకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 32 మంది ఎంపిక


క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలేంలోని శ్రీ శివానీ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

డీవీస్, విస్టుబా, డైకిన్ సంస్థలు క్యాంపస్ ఎంపికలు నిర్వహించాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా 32 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, పాలిటెక్నిక్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్‌తో కూడిన అధ్యాపకులు అభినందించారు.

పలాసలో కిడ్నాప్ కలకలం


కుమారస్వామి

కాశీబుగ్గ: బాలుడికి మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన సంఘటన మంగళవారం ఉదయం పలాసలో కలకలం రేపింది. బాలుడి తల్లిదండ్రులు చెప్పిన వివరాల మేరకు.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 28వ వార్డు రాజమ్మ కాలనీకి చెందిన కుమారస్వామి అనే బాలుడు జీడి కార్మికురాలైన తల్లిని కలిసేందుకు ఆమె పనిచేస్తున్న జీడి పరిశ్రమకు వెళ్తున్నాడు. ఈ తరుణంలో పలాస హైస్కూల్ క్రీడా మైదానం వద్ద ఓ వ్యక్తి బైక్‌పై వచ్చి బాలుడికి ఏదో చెప్పి తన బండి ఎక్కించుకున్నాడు. పలాస రైల్వే స్టేషన్ వైపు బాలుడిని తీసుకెళ్తుండగా బాలుడికి అనుమానం వచ్చి గట్టిగా కేకలు వేశాడు. స్థానికులు గుర్తించి అడ్డుకునేందుకు ప్రయత్నించినా అతను వాహనం ఆపలేదు. అయితే దారిలో బాలుడి బంధువులు గుర్తించి ఆ వాహనాన్ని ఆపగా.. బాలుడిని విడిచి పరారయ్యాడు. అనంతరం బాలుడిని తల్లికి అప్పగించారు.

కోమర్తిలో కొట్లాట

నరసన్నపేట: మండలంలోని కోమర్తిలో సోమవారం సాయంత్రం జరిగిన వివాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరు ఉంగటి రాజు, పోలినాయుడులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో సర్పంచ్ ఉంగటి చిన్నమ్ముడు భర్త ఉంగటి రాజుకు తీవ్ర గాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం సాయంత్రం పెంట స్థలం వద్ద ఉంగటి రాజు, ముద్దాడ అప్పన్నల మధ్య వివాదం చోటు చేసుకుంది. అనంతరం ఘర్షణ జరిగింది. తన కల్లంలో పనులు చేసుకుంటున్న ఉంగటి రాజు ఆయన సోదరుడిపై గొల్లంగి శ్రీను, ముద్దాడ అప్పన్న, పోలినాయుడు తదితరులు దాడికి ప్రయత్నించారు. ఈ గొడవలో ఉంగటి రాజు నుదుటిపై బలమైన గాయమైంది. వెంటనే రాజు ప్రభుత్వాస్పత్రిలో చేరగా వైద్యులు చికిత్స చేశారు. అలాగే దూసి పోలినాయుడు, ఆయన భార్య కూడా ఆస్పత్రిలో చేరారు. ఈ వివాదంపై ఉంగటి రాజు, దూసి పోలినాయుడులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పాలిటెక్నిక్ కోర్సులతో మెరుగైన ఉద్యోగావకాశాలు


జాబ్ అచీవర్స్‌డేలో మాట్లాడుతున్న జేటీఓ శ్రీహరి

ఆమదాలవలస రూరల్: పాలిటెక్నిక్ కోర్సులు చేసే విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని బీఎస్ఎన్ఎల్ జేటీఓ గురుగుబెల్లి శ్రీహరి అన్నారు. మండలంలో దన్నానపేట గ్రామం సమీపంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన 41 మంది విద్యార్థులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు రావడంపై అభినందనలు తెలియజేశారు. వారందరికీ నియామక పత్రాలు అందజేశారు. పాలిటెక్నిక్‌లో చేరిన విద్యార్థుల్లో నైపుణ్య కల్పన, ఉద్యోగ సాధనలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు చదువుకోడానికి అస్కారం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌సీఎల్ ఏజీఎం వీఆర్ పాండా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నెపు గోపి, ఎలక్ట్రానిక్ విభాగాధిపతి పి.శ్రీనివాస్, ఎమ్.మోహన్‌దాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడికి యత్నం.. కేసు నమోదు

పొందూరు: మండలంలోని ఒక గ్రామంలో ఐదేళ్ల చిన్నారిపై జరిగిన లైంగిక దాడి యత్నం కేసులో చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.రవికుమార్ తెలిపారు. సోమవారం రాత్రి ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తక్షణ నివేదికలు అందించండి

ఈ లైంగిక దాడికి యత్నం కేసుపై శ్రీకాకుళం పోలీసు ఉన్నతాధికారులు ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు తక్షణ నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లను పట్టించుకోకుండా నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖ అందించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు కమిషన్ సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.

చల్లంగ చూడమ్మా..


కంచిలిలో కంచమ్మతల్లి అమ్మవారి చల్లదనంలో ఊరేగింపు


కంచిలిలో సాంస్కృతిక ప్రదర్శన

కంచిలి: మండలంలోని కంచిలి, అంపురం గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. కంచిలిలో కంచమ్మతల్లి అమ్మవారి చల్లదనం మహోత్సవాన్ని మంగళవారం ఒక్కరోజు ఆనవాయితీగా నిర్వహించారు. అమ్మవారిని స్థానిక రైల్వేస్టేషన్ కూడలిలో ఉన్న పీఠం వద్ద నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారితో పాటు కాళికా వేషధారణలు, వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంపురంలో పాలపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు చివరి రోజు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ కూడా అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.

జూన్ 6 వరకు ఎన్నికల కోడ్

- 144 సెక్షన్ అమలులో ఉంటుంది
- కౌంటింగ్ రోజున డ్రైడే
- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓట్ల లెక్కింపు శాంతియుత వాతావరణంలో జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపుపై పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్లతో ఎస్పీ జీఆర్ రాధిక, ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లతో కలిసి ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుల్స్ ఉంటాయని, పోస్టల్ బ్యాలెట్‌కు కూడా మూడు లేదా నాలుగు టేబుల్స్ ఉంటాయన్నారు. అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకు చేరుకోవాలని, 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రతి ఏజెంటు పెన్ను, పెన్సిల్, నోట్ పేడ్ తీసుకురావాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారులు అనుమతి లేకుండా ఏజెంట్లు ఎవరూ లోపలికి బయటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. సర్వీసు ఓటర్ల ఓట్లను జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల వరకు వచ్చిన వాటిని లెక్కింపునకు తీసుకుంటారని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ తరలింపు సమయంలో అభ్యర్థులు రావచ్చునని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాటర్ బాటిల్స్ లేదా ఇతర ద్రవ పదార్థాలు, తదితర నిషేధిత వస్తువులను అనుమతించరని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఏ ఒక్క వాహనానికి ప్రవేశం లేదన్నారు.

ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకూడదన్నారు. కౌంటింగ్ కేంద్రమైన శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాట్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బలగాలతో ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో గొడవలు జరగకూడదని, సోషల్ మీడియాలో ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలైనా పోస్టింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున డ్రై డే గా పరిగణిస్తారని, మద్యం అమ్మడం గానీ, సేవించడం గాని చేయరాదన్నారు. జూన్ 6 వరకు కోడ్ అమలులో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు, సభలు, బాణసంచా, సామగ్రి వాడకానికి అనుమతి లేదని తెలియజేశారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ మాట్లాడుతూ కౌంటింగ్ పై ఏజెంట్లు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ నియోజక వర్గానికి వెళ్లాలో సైనేజ్ బోర్డులు క్లియర్‌గా ఉన్నట్లు చెప్పారు.

సమావేశంలో టెక్కలి రిటర్నింగ్ అధికారి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, డాక్టర్ భరత్ నాయక్, అప్పారావు, సీహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, డీఎస్పీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు శ్రీకాకుళం పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేరాడ తిలక్, నరసన్నపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.